



PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| మంగళవారం 01 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 91 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## మూసీపై ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జి ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మూసీ నదిపై అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించిన ముఖ్యమంత్రి, బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. మొత్తం 400 మీటర్ల పొడవుతో రూ.52 కోట్ల వ్యయంతో ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, అసదుద్దీన్ ఓవైసీ, శాసనసభ్యులు కాలేరు వెంకటేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేష్, నవీన్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో విప్లవాత్మక నిర్ణయాలు: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విధ్వంసానికి గురైన తెలంగాణను వికాసం వైపు నడిపించేందుకు ప్రజా ప్రభుత్వం గడిచిన వెయ్యి రోజుల పరిపాలనలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమంతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి సామాజిక అంశాల్లో దూరదృష్టితో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడిన రాష్ట్రాన్ని వెయ్యి రోజుల్లో రూపాయి రూపాయి కూడబెట్టి ముళ్లబాట నుంచి హైవేకు తీసుకొచ్చామని, ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ పరిపాలనను గాడిలో పెట్టామని చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల లోగోలను ఆవిష్కరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024 జనవరి 1 నుంచి ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే విధంగా జీతాలు అందించాలని ఆదేశించామని తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచడంతో ప్రస్తుతం నెలకు సుమారు వెయ్యి మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నారని, గత ప్రభుత్వం రూ.8 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు పెట్టగా, వంద రోజుల్లోనే రూ.6 వేల కోట్లు చెల్లించామని వివరించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన ఆర్టీసీ ఉద్యోగుల్లో మృతి చెందిన 60 మంది కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టి అండగా నిలిచామని అన్నారు. రాష్ట్రంలోని నర్సరీ నుంచి 12వ తరగతి వరకు 27.50 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగలేదని విమర్శించిన సీఎం, తమ ప్రభుత్వం రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశంలోనే అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టిందన్నారు. రైతుల సంక్షేమం కోసం వెయ్యి రోజుల పాలనలో రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని, 30 నెలల్లో రైతుల ధాన్యం కొనుగోలుకు రూ.90 వేల కోట్లు, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ, ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందించామని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మహిళల సంక్షేమంలో భాగంగా కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలు కల్పించామని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేసే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. గత 32 నెలల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయిస్తున్నామని, హైటెక్ సిటీ శిల్పారామం వద్ద 3.5 ఎకరాల విలువైన స్థలంలో ఇందిరా మహిళా శక్తి స్టాళ్ల ఏర్పాటుకు అవకాశం కల్పించామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 1.17 కోట్ల రేషన్ కార్డులు జారీ చేశామని, 3.48 లక్షల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, కోర్ అర్బన్ ఏరియాలో పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లను అపార్ట్‌మెంట్ల రూపంలో నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా విశేష సేవలందించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి పేరును సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రికి పెట్టామని, త్వరలో అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రులను ప్రారంభిస్తామని తెలిపారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత పాలకులు పేదల గురించి పట్టించుకోలేదని, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పరిస్థితిని మెరుగుపరిచేందుకు రూ.2 వేల కోట్లతో కొత్త ఆసుపత్రి నిర్మించాలనే ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. సచివాలయం ఎదురుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంతో పాటు జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేశామని, మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు పెట్టామని గుర్తుచేశారు. 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని, 1931 తర్వాత వందేళ్లుగా జరగని కులగణనను నిర్వహించి లెక్కలు తేల్చామని తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టం, క్రీడలు, ఐటీ, ఆరోగ్యం, పర్యాటకం, దేవాదాయ శాఖలకు ప్రత్యేక విధానాలు తీసుకొచ్చామని, సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని అత్యద్భుతంగా నిర్మించుకున్నామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణను ప్రణాళికాబద్ధంగా మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఓఆర్ఆర్‌లోపు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీగా, రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పాలనలో చేపట్టిన కార్యక్రమాలు విజయానికి నిదర్శనమని, పదేళ్లలో జరిగిన విధ్వంసం నుంచి తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామని, పరిపాలన గాడిలో పడిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి వైపు సాగుతున్న ప్రయాణంలో ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు.



## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్‌ను భారతదేశంలోనే తొలి, అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధమైన కార్యక్రమాలతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఇటీవల యూకే, అమెరికా పర్యటనలో సాధించిన పురోగతిపై తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలను భాగస్వామ్యాలు, ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ద్వారా హైదరాబాద్‌కు తీసుకురావడానికి ప్రభుత్వం అత్యంత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తద్వారా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిపుణులు, ప్రభుత్వ అధికారులు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన ధ్రువపత్ర కార్యక్రమాలు, కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు యూకేలో, అధికారుల బృందం అమెరికాలో పర్యటించింది. ఈ బృందంలో డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ సంస్థ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంతికుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. శ్రీధర్ తదితరులు ఉన్నారు. పర్యటనలో నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, బోస్టన్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ సంస్థలు భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించగా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ సంస్థలతో చర్చలు కూడా సానుకూలంగా సాగాయి. ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, కొత్త బోధనా విధానాలు, తరగతి గది పరస్పర చర్చా వేదికలు, అధ్యాపకుల భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయా సంస్థల ప్రతినిధి బృందాలు హైదరాబాద్‌లో పర్యటించేందుకు అంగీకరించాయి. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ప్రభుత్వ, కార్పొరేట్ అధికారుల కోసం స్వల్పకాలిక కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలను ప్రారంభించేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ అంగీకరించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల ప్రతినిధులతోనూ తెలంగాణ రైజింగ్ బృందం చర్చలు జరిపింది. అమెరికాలో నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో జరిగిన చర్చల ఫలితంగా పలు ఒప్పందాలు కుదిరాయని, త్వరలో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పర్యటన ఫలితాలు తెలంగాణ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ కుదరడం పెద్ద ప్రోత్సాహమని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని యువత, చిన్నారులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు అందించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తానని తెలిపారు. హైదరాబాద్‌కు రానున్న ప్రపంచస్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో పాటు దేశంలోని యువత, చిన్నారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని, యువత ఈ అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రపంచస్థాయిలో పోటీపడగల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సీఎం ఆకాంక్షించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, క్రీడా సంస్థలు, తెలంగాణపై వాటి ప్రభావం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

## వెలిగొండ సంబరం.. కృష్ణమ్మకు వందనం.. 30 ఏళ్ల కల సాకారం



మార్కాపురం, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో కరువు ప్రాంతాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. ప్రతిష్ఠాత్మక పూల సుబ్బయ్య వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, నీటిని నల్లమలసాగర్ జలాశయంలోకి విడుదల చేశారు. అనంతరం కృష్ణమ్మకు సాష్టాంగ నమస్కారం చేశారు. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గారే వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేయగా, సరిగ్గా మూడు దశాబ్దాల తర్వాత 2026 ఆగస్టు 31న అదే ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రిగా ప్రారంభించి జాతికి అంకితం చేయడం చారిత్రక ఘట్టంగా నిలిచింది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన ఈ రోజును తన జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేనని, రైతులు, నిర్వాసితులతో కలిసి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును మూడు దశాబ్దాల తర్వాత ప్రారంభించి కరువు నేలపై కృష్ణమ్మ జలాలను చూడటం ఎంతో భావోద్వేగాన్ని కలిగించిందన్నారు. కరువుతో పోరాడిన రైతులు, ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు వెలిగొండ ప్రాజెక్టు గొప్ప ఉపశమనం కలిగించనుందని, ఇది కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే అభివృద్ధి ప్రాజెక్టుగా నిలుస్తుందని అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాలను ఎలాంటి విద్యుత్ పంపింగ్ అవసరం లేకుండా గురుత్వాకర్షణ ఆధారంగా సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించే విధంగా ప్రాజెక్టును రూపొందించారు. తొలి దశలో 18.8 కిలోమీటర్ల పొడవైన రెండు సొరంగాలతో పాటు 21.8 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్ పనులు పూర్తయ్యాయి. తొలి దశకు రూ.7,983 కోట్ల వ్యయం కాగా, మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,200 కోట్లుగా ఉంది. తొలి దశ ద్వారా నల్లమలసాగర్‌లో 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నిల్వ చేసి సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు నాలుగు లక్షల మందికి తాగునీరు అందించే అవకాశం ఏర్పడింది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లో సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పునరావాస పరిహారం విషయంలోనూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశ పనులను కూడా ముందుకు తీసుకెళ్లి 2028 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ప్రకటించారు. మార్కాపురం ప్రాంతాన్ని ప్రతిపాదిత రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వెలిగొండ జలసిరులతో మార్కాపురం ప్రాంతానికి మంచి రోజులు ప్రారంభమయ్యాయని, ఈ ప్రాంతం ఇక అభివృద్ధిలో దూసుకుపోతుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కృష్ణా జలాలు కరువు నేలకు చేరడంతో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప ప్రాంతాల ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. వెలిగొండ ప్రాజెక్టు సాగునీటి కొరతను తీర్చడంతో పాటు తాగునీటి భద్రత, వ్యవసాయాభివృద్ధి, ఉద్యాన పంటల విస్తరణ, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించనుందని ప్రభుత్వం భావిస్తోంది. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' అనే నినాదంతో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమం మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికిన చారిత్రక ఘట్టంగా నిలిచింది.



## విముక్త జాతుల అభ్యున్నతికి ప్రాధాన్యమివ్వాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సమాజంలో అత్యంత వెనుకబడిన విముక్త జాతుల సమగ్ర అభ్యున్నతికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విముక్త జాతుల దినోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక కారణాలతో తీవ్ర అణచివేతకు గురైన ఈ వర్గాలకు సామాజిక భద్రతతో పాటు ఆర్థిక పరిపుష్టి కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బ్రిటీష్ పాలనా కాలంలో అమలులో ఉన్న 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' కారణంగా కొన్ని సముదాయాలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయని, పుట్టుకతోనే నేరస్తులుగా ముద్ర వేసి సమాజానికి దూరం చేసిన ఆనాటి దురాచారాలు వారి అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఆ చట్టం రద్దయినప్పటికీ నేటికి ఆయా వర్గాలు అనేక విధాలుగా వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విముక్త జాతులకు అవసరమైన గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, గృహ వసతి వంటి ప్రభుత్వ సదుపాయాలు అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, భద్రతా భావాన్ని పెంపొందించాలని సూచించారు. విముక్త జాతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గ్రామ స్థాయి నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డీఎల్‌పీఓలు, పంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యం చేసి గ్రామాల్లోని సమస్యలు, లోటుపాట్లు, అవసరాలను గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్దిష్ట గణాంకాలు అందుబాటులో లేనందున ప్రాథమిక సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి, ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన వారికి విడతల వారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించే సమయంలో కేవలం విముక్త జాతుల సమస్యలకే పరిమితం కాకుండా అన్ని వెనుకబడిన వర్గాల అవసరాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, క్లిష్టమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లా ఎల్లప్పుడూ చైతన్యవంతమైన జిల్లాగా నిలుస్తోందని, ప్రజాప్రతినిధులు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సేవలు అందించడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం జిల్లా ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జడ్పీ సీఈఓ శిరీష, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విశాల్, మాజీ శాసనసభ్యుడు దోసపాటి గోపాల్, కౌన్సిలర్ ఊరా రామ్మూర్తి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, యాదవ సంఘం నాయకులు కోడి లింగయ్య, పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బహుజన మహాసభ సంఘం ప్రతినిధి వీరబోయిన వెంకట్ యాదవ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బాధ్యులు చిన్న శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సామాజిక వర్గాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్రస్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమర్పించే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయిలోనే స్థానిక సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 70 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి సంబంధించి 7, మున్సిపాలిటీకి సంబంధించి 5, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి 3, ఇతర వివిధ శాఖలకు సంబంధించిన 19 దరఖాస్తులు ఉన్నాయని, వాటిని శాఖల వారీగా పరిష్కారం కోసం పంపించినట్లు కలెక్టర్ వివరించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, సీపీఓ కిషన్, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగానికి ప్రమీల వెంకట్రావు సేవలు ప్రశంసనీయం: ఎంఈఓ వనం సత్యనారాయణ

నడిగూడెం, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): విద్యారంగానికి కొల్లు ప్రమీల వెంకట్రావు అందించిన సేవలు ప్రశంసనీయమని నడిగూడెం మండల విద్యాధికారి వనం సత్యనారాయణ అన్నారు. సోమవారం నడిగూడెం మండలం రత్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు కొల్లు ప్రమీల వెంకట్రావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. శారద అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ వనం సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల పాటు విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ప్రమీల వెంకట్రావు విద్యాబోధనతో పాటు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, పేద విద్యార్థులకు చేసిన సహాయం అభినందనీయమన్నారు. విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధికి ఆమె అందించిన సేవలు ప్రత్యేకంగా నిలిచాయని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా సేవాభావంతో నిర్వహించిన ప్రమీల వెంకట్రావు సేవలు నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. శారద మాట్లాడుతూ ప్రమీల వెంకట్రావుతో కలిసి పనిచేసిన అనుభవం ఎంతో విలువైనదని, ఆమె క్రమశిక్షణ, సేవా దృక్పథం, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కోదాడ మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసిన సమయంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ వందలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆమె కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డాట్ల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ ఈదమ్మ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ జి. పద్మావతి, సీఆర్‌పీ రామారావు, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటాచారి, మాజీ సర్పంచ్ పసుపులేటి బాబు, మండల వార్డు సభ్యుల అధ్యక్షుడు మిరియాల శ్రీను, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన కొల్లు ప్రమీల వెంకట్రావును శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి అభినందనలతో వీడ్కోలు పలికారు.

## అయ్యప్ప దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడు నీరజా శంకర్ గౌడ్‌కు ఘన సన్మానం







కోదాడ, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కోదాడలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన హుజూర్‌నగర్ వాస్తవ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 264 కంఠమేశ్వర స్వామి విగ్రహాలను దానం చేసిన నీరజా శంకర్ గౌడ్, ఆయన కుటుంబ సభ్యులను సోమవారం గౌడ సంఘం నాయకులు, అయ్యప్ప స్వామి సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆలయ ఉపాధ్యక్ష పదవిని స్వీకరించిన శంకర్ గౌడ్ సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక రంగంలో అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. భక్తి కార్యక్రమాల నిర్వహణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప స్వామి సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ముత్తినేని కోటేశ్వరరావు, వాసుదేవరావు, జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశగాని నాగేశ్వరరావు, రాష్ట్ర గౌరవ ఉపాధ్యక్షుడు సోమగాని నర్సింహారావు, మునగాల గౌడ సంఘం నాయకులు గండు అంజయ్య గౌడ్, నారగాని వెంకయ్య గౌడ్, నారగాని వెంకన్న గౌడ్, గుడిబండ గ్రామ సంఘ అధ్యక్షుడు కుక్కడపు సైదులు, సింగారం గ్రామ గౌడ సంఘ నాయకులు రావుల కోటయ్య, రావుల కొండలరావు తదితరులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీరజా శంకర్ గౌడ్, కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## కోదాడ బంద్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



కోదాడ, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నిరుపేద మహిళ గంధం కనకమ్మకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కోదాడ పట్టణ బంద్‌ను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి ఆటంకం కలిగించకుండా పాన్ డబ్బా నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేద మహిళ గంధం కనకమ్మపై కోదాడ టౌన్ సీఐ వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధికార బలంతో సామాన్య, నిరుపేద మహిళపై అమానుషంగా వ్యవహరించిన సదరు సీఐని తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసి, బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కనకమ్మకు అండగా నిలిచి మానవత్వాన్ని చాటేందుకు నిర్వహించిన కోదాడ పట్టణ బంద్‌కు పట్టణ, నియోజకవర్గ ప్రజలు, మేధావులు, పుర ప్రముఖులు, వర్తక-వాణిజ్య సంస్థల యజమానులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, వీధి వ్యాపారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సహకరించడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యపై స్పందించి బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బొల్లం మల్లయ్య యాదవ్ తెలిపారు.



## ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు సంగీత, పాండు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందగా, వాటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్ డివిజన్‌లో 3 ఫిర్యాదులు, వినతులు అందాయని, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, గృహ నిర్మాణం, పింఛన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఉపాధి, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, భూగర్భ జలాలు, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు, వినతులు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి, ప్రజలకు సకాలంలో పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపికలకు జిల్లా జట్ల ఎంపిక

సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్స్ 2026–27లో పాల్గొనేందుకు సంగారెడ్డి జిల్లా జట్ల ఎంపికలను సెప్టెంబర్ 3న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి టి. అఖిలేష్ రెడ్డి తెలిపారు. జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు), క్రికెట్ (పురుషులు), చెస్ (పురుషులు, మహిళలు), క్యారమ్స్ (పురుషులు, మహిళలు), హాకీ (పురుషులు, మహిళలు), పవర్ లిఫ్టింగ్ (పురుషులు, మహిళలు), స్విమ్మింగ్ (పురుషులు, మహిళలు), టేబుల్ టెన్నిస్ (పురుషులు, మహిళలు), వాలీబాల్ (పురుషులు, మహిళలు), వెయిట్ లిఫ్టింగ్ (పురుషులు, మహిళలు), రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, ఖో-ఖో, యోగా, బాస్కెట్‌బాల్ (పురుషులు, మహిళలు), షటిల్ బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు), ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్ (పురుషులు, మహిళలు), కబడ్డీ (పురుషులు, మహిళలు) తదితర క్రీడల్లో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఆసక్తి కలిగిన శాశ్వత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఈ ఎంపికల్లో పాల్గొనడానికి అర్హులని, ఎంపికలకు హాజరయ్యే ఉద్యోగులు తప్పనిసరిగా సర్వీస్ సర్టిఫికెట్ లేదా ఉద్యోగ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన ఉద్యోగులు సెప్టెంబర్ 3న జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ఎంపికలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించాలని జిల్లా యువజన, క్రీడల అధికారి టి. అఖిలేష్ రెడ్డి కోరారు.



## అన్ని వర్గాల అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గం: అదనపు కలెక్టర్ పాండు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించి అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించేందుకు విద్యే ప్రధాన మార్గమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ పాండు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషులను కులాలు, జాతుల పేరుతో విభజించి చూడకుండా ప్రతి ఒక్కరూ సమానంగా అభివృద్ధి చెందేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కులం, జాతి, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. వ్యక్తి తన ఆశయాలకు అనుగుణంగా ఉన్నత హోదాలను సాధించేందుకు విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంచార జాతులు, విముక్త జాతులు, వెనుకబడిన తరగతులకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, పిల్లల భవిష్యత్తు కోసం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యే శాశ్వతమైన మార్గమని, "చదువు ఒక్కటే అభివృద్ధికి పరిష్కారం" అనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తించాలని పిలుపునిచ్చారు. సంచార జాతులు, విముక్త జాతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎంబీసీ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ఎంబీసీ సంచార జాతుల కార్యదర్శి వినోద్, వీరభద్రుల కులాల అధ్యక్షుడు అలుగు మల్లేశం, జంగమ ఎంబీసీ రాష్ట్ర కార్యదర్శి వీరేశం, వీరభద్రుల కులాల జిల్లా అధ్యక్షుడు మోహన్ బాబు, ఎంబీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌తో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బుదేరా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మునిపల్లి మండలం బుదేరాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా వ్యవహారాల్లో నిర్లక్ష్యం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పాటు విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరుపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా కోఆర్డినేటర్ కల్పన బుదేరా కళాశాలను సందర్శించి కళాశాల నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తమ పరిశీలనకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. నివేదికలో పేర్కొన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ప్రిన్సిపాల్ పి. శైలజ నిర్లక్ష్య ధోరణి, కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల తగిన విధంగా వ్యవహరించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థినుల సంక్షేమం, విద్యా ప్రమాణాలు, కళాశాలల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.



## అగ్రిస్టాక్ అమలులో తెలంగాణకు కేంద్రం మరో ప్రోత్సాహకం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అగ్రిస్టాక్ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ అమలులో తెలంగాణ రాష్ట్రం మరో కీలక మైలురాయిని సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు చేపట్టిన అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసినందుకు తెలంగాణకు రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆగస్టు 31న జారీ చేసిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి, నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను రాష్ట్రం పూర్తి చేసిందని పేర్కొందని మంత్రి తెలిపారు. దీంతో ప్రత్యేక రాష్ట్ర మూలధన పెట్టుబడుల సహాయ పథకం 2026–27లో భాగంగా రూ.175 కోట్ల ప్రోత్సాహకానికి తెలంగాణ అర్హత సాధించినట్లు కేంద్రం స్పష్టం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న Special Assistance to States for Capital Investment పథకంలోని వ్యవసాయానికి డిజిటల్ ప్రజా మౌలిక వసతుల విభాగం కింద అగ్రిస్టాక్ ఆధారిత ప్రాధాన్య కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ విభాగంలో మొత్తం రూ.13 వేల కోట్లు కేటాయించగా, అగ్రిస్టాక్ ఆధారిత ప్రాధాన్య కార్యక్రమాలకు రూ.10 వేల కోట్లు, అందులో అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థకు రూ.5 వేల కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే తెలంగాణలో ఫార్మర్ రిజిస్ట్రీని విజయవంతంగా పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం రూ.424 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు చేసిందని మంత్రి గుర్తుచేశారు. తాజాగా అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని పూర్తి చేయడంతో మరో రూ.175 కోట్ల ప్రోత్సాహకం లభించనుందని తెలిపారు. అగ్రిస్టాక్ ద్వారా రైతుల వివరాలు, భూమి, పంటలు, ఎరువుల పంపిణీ తదితర అంశాలను డిజిటల్‌గా అనుసంధానం చేయడం ద్వారా నిజమైన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను మరింత పారదర్శకంగా, వేగంగా అందించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎరువుల పంపిణీలోనూ సమర్థవంతమైన పర్యవేక్షణ, పారదర్శకత పెంపొందుతుందని తెలిపారు. డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా లభిస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్రం సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని మంత్రి తుమ్మల అన్నారు.

## తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఇతర ఉన్నతాధికారులతో సీఎస్ సమావేశం నిర్వహించి రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ, వివిధ శాఖల నుంచి అవసరమైన పరిపాలనా అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సహకారం తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక, ప్రాంతీయ అభివృద్ధికి మెరుగైన రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు. పెండింగ్ సమస్యలను జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించి నిర్ణీత గడువులోగా ప్రాజెక్టుల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర డీపీఆర్‌లు సిద్ధం చేసి రైల్వే బోర్డుకు సమర్పించినట్లు, వీటి అంచనా వ్యయం రూ.50,870 కోట్లుగా అధికారులు సీఎస్‌కు వివరించారు. సమావేశంలో రైల్వే అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు, రహదారుల విస్తరణ, రైల్వే లైన్ల డబ్లింగ్, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా కనెక్టివిటీ మెరుగుదల తదితర సుమారు 21 అంశాలను సమీక్షించారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి తగిన పరిష్కార మార్గాలను గుర్తించాలని సీఎస్ సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పరిపాలన, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, రెవెన్యూ, ఇంధన, రోడ్లు-భవనాల శాఖలు దక్షిణ మధ్య రైల్వేతో సన్నిహిత సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలుకు సహకరించాలని సూచించారు. రైల్వే ప్రాజెక్టుల సకాలంలో పూర్తికి రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిరంతర సమన్వయం కొనసాగించాలని, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని సీఎస్ హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి గతిశక్తి కార్యక్రమం కింద నిధులు సమీకరించేందుకు సమగ్ర డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంఎంటీఎస్ విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే టెర్మినల్ల ఏర్పాటు, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీ కోసం అవసరమైన భూసేకరణతో పాటు బుల్లెట్ రైలు కారిడార్లకు సంబంధించిన ప్రణాళికలపై కూడా సమగ్ర డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన రైల్వే మౌలిక వసతుల విస్తరణను వేగవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఆర్టీసీ ఎండీ నాగి రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, మేడ్చల్-మల్కాజిగిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, నగర ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, నిర్మల్, జనగాం, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రైవేట్ ఫర్టిలిటీ కేంద్రాల్లో ఏఆర్టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే ఫర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాల పనితీరు, ఏఆర్టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్డీటీ చట్టం అమలుపై మంత్రి సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఐవీఎఫ్ కేంద్రాల పనితీరును సమీక్షించిన మంత్రి, రెండు కేంద్రాల్లో ఇప్పటివరకు మొత్తం 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించినట్లు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కేంద్రాల్లో 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 2024 అక్టోబర్‌లో, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో 2024 డిసెంబర్‌లో ఐవీఎఫ్ కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్టీ, సరోగసి కేంద్రాలు రిజిస్టర్ అయి ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిలో 129 ఏఆర్టీ లెవల్-1, 226 ఏఆర్టీ లెవల్-2 కేంద్రాలు, 59 ఏఆర్టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నట్లు వివరించారు. ఏఆర్టీ, సరోగసి చట్టాలకు అనుగుణంగా కేంద్రాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. కేంద్రాల్లో సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఫర్టిలిటీ కేంద్రాల్లో అధికారులు నిర్వహించిన తనిఖీలపై మంత్రి ఆరా తీయగా, ఇప్పటివరకు 379 కేంద్రాలను తనిఖీ చేయగా 50 కేంద్రాల్లో నిబంధనలకు సంబంధించిన డీవియేషన్స్ గుర్తించినట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. సిబ్బంది మార్పులు, రికార్డుల సక్రమ నిర్వహణ లేకపోవడం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ప్రదర్శించకపోవడం, గ్రీవెన్స్ సెల్ నిర్వహించకపోవడం, రిజిస్ట్రేషన్‌లో ఉన్న చిరునామాకు భిన్నమైన ప్రాంతంలో కేంద్రాన్ని నిర్వహించడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు వివరించారు. ఆయా కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఉల్లంఘనల తీవ్రతను బట్టి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన రెండు కేంద్రాల రిజిస్ట్రేషన్లు రద్దు చేయగా, తొమ్మిది కేంద్రాల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించే కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ఫర్టిలిటీ సేవల పేరుతో పేషెంట్లపై అనవసర ఆర్థిక భారం పడకుండా పారదర్శకంగా సేవలు అందేలా చూడాలని, కేంద్రాల్లో వినియోగించే మందులు, ఇంజక్షన్లు, తయారీ సంస్థలు, ఎంఆర్‌పీ తదితర వివరాలను కూడా తనిఖీల్లో పరిశీలించాలని ఆదేశించారు. పీసీపీఎన్డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన మంత్రి, ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో ఏప్రిల్ నుంచి జూలై వరకు 2,600 తనిఖీలు నిర్వహించినట్లు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. 52 కేంద్రాల్లో 37 డీవియేషన్స్ గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే అవకాశమున్న కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పీసీపీఎన్డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ రంగంలో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించడంతో పాటు ప్రైవేట్ రంగంలో నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, చట్టబద్ధతను నిర్ధారించేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యానారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, ఐవీఎఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్రతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా రూపుదిద్దుకోనుంది

హైదరాబాద్, ఆగస్టు 31: హైదరాబాద్‌ను భారతదేశంలోనే తొలి, అతిపెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆగస్టు 19 నుంచి 29 వరకు యూకేలో, అధికారుల బృందం అమెరికాలో నిర్వహించిన పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక చర్చలు జరిపి పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ సాధించింది. హైదరాబాద్‌లో భారతదేశంలో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, బోస్టన్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ అంగీకరించగా, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో క్యాంపస్ ఏర్పాటుపై పరిశీలన చేయనుంది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (సోఆస్) హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ పాఠశాలలు, ప్రత్యేక కోర్సులు, పరిశ్రమలతో పరస్పర భాగస్వామ్యాలు, ఆధునిక బోధనా విధానాలు, తరగతి గది పరస్పర చర్చా విధానాలు, అధ్యాపకుల భాగస్వామ్యంపై పరిశీలనకు తమ ప్రతినిధి బృందాలను హైదరాబాద్‌కు పంపేందుకు అంగీకరించాయి. హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రభుత్వ, కార్పొరేట్ రంగాలకు చెందిన సీనియర్ అధికారుల కోసం స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ విద్యా కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. వర్జీనియా టెక్ తెలంగాణలో పరిశ్రమలకు అనుగుణమైన, భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేసే విద్యా, నైపుణ్య శిక్షణ విధానాలను తీసుకురావడంపై చర్చలు జరపగా, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించనుంది. అలాగే మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులతోనూ తెలంగాణ రైజింగ్ బృందం చర్చలు నిర్వహించింది. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల ప్రముఖ అధ్యాపకులు హైదరాబాద్‌కు వచ్చి ప్రత్యేక ఉన్నత విద్యా కోర్సులు, ధ్రువపత్ర కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో కుదిరిన భాగస్వామ్యాలు మరింత ఊతమిస్తాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచస్థాయిలో పోటీపడగల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య, నైపుణ్యాలు, క్రీడలను యువతకు అందించడాన్ని ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని, ప్రభుత్వ పాఠశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చే కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుతో సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, తయారీ రంగాల్లో మరింత పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రపంచస్థాయి విద్యా కార్యక్రమాలకు అనుగుణంగా తరగతి గదులను ఆధునీకరిస్తున్నామని, త్వరలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బంది, ప్రైవేట్ రంగ ఉద్యోగులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల విద్యా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచే అభ్యసించే అవకాశం పొందుతారని అధికారులు వెల్లడించారు. గ్లోబల్ నాలెడ్జ్ హబ్ అభివృద్ధిలో భాగంగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ క్యాంపస్‌తో పాటు భవిష్యత్తులో భారత్ ఫ్యూచర్ సిటీలోనూ వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, క్రీడా సౌకర్యాలు, వాటి ద్వారా రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



# సీఎం సమీక్షా నిర్ణయాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ముఖ్యమంత్రి వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాల అమలును వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎస్, ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై శాఖల వారీగా అమలు నివేదికలను సమీక్షించారు. ఆయా శాఖలు సమగ్రంగా, తాజా సమాచారంతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లను సమర్పించాలని, అందులో తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతి, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిర్దేశించిన గడువులను స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. కేవలం నిర్ణయాలను నమోదు చేయడానికే పరిమితం కాకుండా వాటి అమలు, ఫలితాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఏటీఆర్‌లు ఉపయోగపడేలా చూడాలని సీఎస్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డు పనితీరును కూడా సమీక్షించిన ఆయన, ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, ప్రాధాన్యతా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డును మరింత సమర్థవంతమైన సాధనంగా తీర్చిదిద్దాలని సూచించారు. డ్యాష్‌బోర్డులో సంబంధిత శాఖలు నమోదు చేసే సమాచారం కచ్చితంగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా, ఎప్పటికప్పుడు నవీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో జాప్యాలను గుర్తించడం, ఎదురవుతున్న అవరోధాలను పరిష్కరించడం, ప్రధాన ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయడం వంటి అంశాల్లో డ్యాష్‌బోర్డును సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి వ్యవస్థ పనితీరును కూడా సీఎస్ సమీక్షించారు. ప్రజావాణి వ్యవస్థ ప్రజల అవసరాలకు కేంద్రంగా, ఫలితాల ఆధారంగా పనిచేయాలని, అందిన ఫిర్యాదుల పరిష్కారాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు నిర్ణీత సమయంలో సరైన, స్పష్టమైన సమాధానం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పదేపదే వస్తున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేలా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమైన అంశాలపై కూడా సీఎస్ సమీక్షించారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి, ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి శాఖల మధ్య మెరుగైన సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అధికారులు పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ, అంతర్‌శాఖ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును పర్యవేక్షించడం, సీఎం డ్యాష్‌బోర్డును బలోపేతం చేయడం, ప్రజావాణి ద్వారా ప్రజా ఫిర్యాదులకు సమర్థవంతమైన పరిష్కారం అందించడం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సంజయ్ జాజు ఉన్నతాధికారులను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం, నిర్ణీత గడువులోగా కార్యక్రమాల అమలు, సమర్థవంతమైన పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయం కీలక అంశాలుగా ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, బీఎండీ ఎక్కా, నవీన్ మిట్టల్, దాన కిశోర్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భూభారతితో దశాబ్దాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మహబూబాబాద్, సెప్టెంబర్ 1: రాష్ట్రంలో రైతులు, భూ యజమానులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు భూ భారతి రీ-సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో దాదాపు 60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్డ్ భూముల సమస్యను భూ భారతి రీ-సర్వే ద్వారా పరిష్కరించి 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆధార్‌తో కూడిన పట్టాదార్ పాస్‌బుక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 125 ఏళ్ల క్రితం భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత సమగ్ర భూ సర్వే జరగలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, గతంలో ఉన్న ధరణి స్థానంలో భూ యజమానులకు అండగా నిలిచేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రాన్ని భూ వివాదాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన పట్టాదార్ పాస్‌బుక్కులను రైతులు, భూ యజమానులకు అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల తుంగతుర్తిలో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3,400 ఎకరాలకు పట్టాలు అందించామని, తాజాగా నారాయణపురంలో 780 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశామని వివరించారు. నారాయణపురంలో తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న మరో సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన సమస్యను కూడా త్వరలో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు తమ తీరు మార్చుకోవాలని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని, మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి అవకాశం ఇవ్వొద్దని ఆదేశించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి నెల కనీసం ఒకటి, రెండు సార్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశాలకు డిప్యూటేషన్ పేరుతో సంతకాలు చేసి కొందరు తహసీల్దార్లు, ఎంఆర్ఓలు హాజరుకాకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం చేపట్టిన భూ భారతి వంటి సంస్కరణలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశం.. ప్రభుత్వ పనితీరుపై నిర్మాణాత్మక సూచనలు చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశం సోమవారం శాసన పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ హాజరై నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్యతో పాటు సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, పి. రాకేశ్ రెడ్డి, యాదవ రెడ్డి, వన్యప్రాణులు-పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ హోదాలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిల్ జాదవ్, సౌకర్యాల కమిటీ చైర్మన్ హోదాలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సభ్యులు మేడిపల్లి సత్యం, యల్. రమణ, ప్రకాష్ గౌడ్, నెల్లికంటి సత్యం, బండారి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మట్టా రాగమయి, సభ్యులు పల్వాయి హరీష్ బాబు, జుల్ఫికర్ అలీ, దేశపతి శ్రీనివాస్, సిహెచ్. అంజిరెడ్డి, బొగ్గారపు దయానంద్ పాల్గొన్నారు. శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉండకపోవచ్చని, అలాంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలు చేయడంలో శాసన కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజాధనం సద్వినియోగం వంటి అంశాలపై కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తున్న నిధులు సక్రమంగా, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వినియోగమవుతున్నాయా అనే అంశాన్ని అంచనాల కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయాలని అన్నారు. వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ అడవులు, వన్యప్రాణుల సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సౌకర్యాల కమిటీ ప్రజాప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించి మెరుగుపరచేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రంథాలయ కమిటీ శాసనసభ, శాసనమండలి సభ్యులకు అవసరమైన సమాచారం, చట్టాలు, నివేదికలు, పరిశోధన పత్రాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి శాసనసభ గ్రంథాలయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ కేవలం ప్రభుత్వ చర్యలను సమీక్షించడానికే పరిమితం కాకుండా రాష్ట్రంలో జీవనానికి ఆధారమైన అడవులు, వన్యప్రాణులు, జల వనరులు, గాలి, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో కీలక బాధ్యతను నిర్వహించాలని అన్నారు. తన పదవీకాలంలో పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణకు సంబంధించి కమిటీ సభ్యులు నిర్మాణాత్మకమైన సూచనలు, సహకారం అందించాలని కోరారు. శాసనమండలి గ్రంథాలయం కేవలం పుస్తకాల సమాహారం కాదని, అది శాసనమండలికి జ్ఞాన కేంద్రం, సంస్థాగత చిహ్నమని స్పీకర్ పేర్కొన్నారు. చట్టాలు, బిల్లులపై చర్చల సమయంలో గ్రంథాలయం విలువైన సమాచారాన్ని అందిస్తుందని, సభ్యులందరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన చర్చలు, రికార్డులను అధ్యయనం చేయడం ద్వారా సభ్యులు మరింత జ్ఞానంతో, స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో సభలో మాట్లాడగలరని తెలిపారు. సౌకర్యాల కమిటీ సభ్యుల నివాస వసతులు, పరిశుభ్రత, నిర్వహణ, ఆహారం, క్యాటరింగ్, వైద్య సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అన్నారు. మాజీ సభ్యుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, వారు అందించిన సేవలు, కృషిని గౌరవిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ముఖ్యంగా వైద్యం, పెన్షన్‌కు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంచనాల కమిటీ ప్రతి శాఖ నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించిన అనంతరం ప్రజాధనం దుబారా కాకుండా తగిన సూచనలు, సిఫారసులు చేయాలని స్పీకర్ అన్నారు. శాసన కమిటీలు ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేలా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు తమవంతు సహకారం అందించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు.



## ప్రజా భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం: జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్, జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): పోలీసు శాఖ వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట డివిజన్ డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మంగళవారం వార్షికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, తీవ్రమైన చీటింగ్ కేసులు, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్ట ప్రకారం నిర్దేశించిన పరిమిత సమయంలోనే కేసుల దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరుతో పాటు సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రజా భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్న ఎస్పీ, పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్, కార్డన్ సెర్చ్‌లు నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే చర్యలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో ఎస్పీ వెంట సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు యాదవేందర్‌రెడ్డి, మహేష్, అనిల్‌రెడ్డి, స్టార్ ఆర్ఎస్ఐ అశోక్, డీసీఆర్‌బీ సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సీసీ సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణికి ఘన సన్మానం

సూర్యాపేట, సెప్టెంబర్ 1: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి కే. లతను సోమవారం వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అర్హులైన ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సామాజిక వర్గాల సమస్యలు తదితర అంశాలపై నాయకులు అధికారిణితో చర్చించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ జాతీయ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు యాతాకుల రాజన్న మాదిగ, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బొల్లెద్దు వినయ్, దళిత సామాజిక నాయకులు, పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ యాతాకుల సునీల్, నాయి బ్రాహ్మణ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐలకు ఘన వీడ్కోలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1: ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమని, ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందడం గొప్ప విషయమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐలు కిష్టారెడ్డి, పవన్, రఫీక్‌లను ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కిష్టారెడ్డి 1985లో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి ఉమ్మడి మెదక్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తూ అంచెలంచెలుగా పదోన్నతులు పొంది ఎస్ఐ స్థాయికి ఎదిగారని తెలిపారు. పవన్, రఫీక్‌లు 1989లో సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు గ్రేహౌండ్స్ విభాగంలో సేవలందించి ఎస్ఐ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ఉద్యోగులు విజయవంతంగా విధులు నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, ఆనందంగా, ప్రశాంతమైన జీవితం గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖ తరఫున వారికి, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐ సురేష్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

అందోల్ మండలం, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం నేరడిగుంట గ్రామానికి చెందిన బేగరి నర్సింలు మృతి చెందడంతో విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సాయికిరణ్ తల్లి వొగ్గు వసంత మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో వికలాంగుల విభాగం ఏర్పాటు చేస్తే రాజకీయ మార్పు తెస్తాం

హైదరాబాద్, సెప్టెంబర్ 1: బీఆర్ఎస్ పార్టీలో వికలాంగుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తే తెలంగాణలోని వికలాంగులను ఏకతాటిపైకి తీసుకువచ్చి రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పు తీసుకొస్తామని, వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ సంచలన ప్రకటన చేశారు. సోమవారం ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల సమర శంఖారావం సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, వికలాంగుల అట్రాసిటీ చట్టం-2016ను సమర్థవంతంగా అమలు చేస్తామని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని రాజేష్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వికలాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని, అప్పటివరకు ఉన్న రూ.500 పెన్షన్‌ను రూ.4,016కు పెంచారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో హరీశ్‌రావు చర్చించి పార్టీలో ప్రత్యేక వికలాంగుల విభాగం ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని కోరారు. తెలంగాణలో వికలాంగుల హక్కుల సాధన కోసం అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన, మాజీ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డికి అవకాశం కల్పించాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లను కోరారు. వికలాంగుల సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ నాయకులు, రాష్ట్రంలోని వివిధ వికలాంగుల సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ధీరావత్ మహేష్‌నాయక్, జవాబు ఛానల్ అధినేత నల్గొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లాలో నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1: శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా నిషేధిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు.




## జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీనివాస్‌కు ఘన సన్మానం

కోదాడ, సెప్టెంబర్ 1: సూర్యాపేట జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాంపాటి శ్రీనివాస్‌ను సోమవారం కోదాడ పట్టణంలోని అమ్మ మెడికల్ ఏజెన్సీ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండెపంగు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సుదీర్ఘకాలంగా విశేష సేవలందించిన కాంపాటి శ్రీనివాస్ సేవలను గుర్తించి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ బాధితులకు చట్టప్రకారం సకాలంలో న్యాయం జరిగేలా, వారికి అవసరమైన పునరావాస చర్యలు సక్రమంగా అందేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతికి తావులేకుండా కమిటీ లక్ష్యాల సాధనకు కాంపాటి శ్రీనివాస్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్, బార్ అసోసియేషన్ నాయకుడు గాలి శ్రీనివాస్ నాయుడు, పాస్టర్ యెషయా, నాయకులు ఖాజా గౌడ్, ఎస్కె మునీర్, పిడతల శ్రీనివాస్, బరపటి కోటేశ్వరరావు, పాలడుగు సంజీవ్, గంధం జాని, కాంపాటి రామకృష్ణ, గజ్జి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## ధరణి కంటే భూభారతి మరింత దరిద్రంగా ఉంది.. జీవో 22ఏను వెంటనే రద్దు చేయాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గతంలో అమలులో ఉన్న ధరణి వ్యవస్థ కంటే ప్రస్తుతం తీసుకొచ్చిన భూభారతి విధానం మరింత దరిద్రంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. సోమవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట జీవో 22ఏను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో 22ఏ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని జీవో 22ఏను తక్షణమే రద్దు చేయాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.



## రైతుల సంక్షేమమే ధ్యేయంగా నర్సింహులు సేవలు

ఆందోల్, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆందోల్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సెక్రటరీ నర్సింహులు పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం సిబ్బంది, సభ్యులు, రైతులు నర్సింహులకు శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి నర్సింహులు ఎన్నో ఏళ్లుగా అందించిన సేవలను పలువురు కొనియాడారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం నర్సింహులను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్

మెదక్, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 48 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో భూ భారతి సమస్యలకు సంబంధించి 16, ఇందిరమ్మ ఇళ్లకు 6, పెన్షన్‌కు 1, ఇతర సమస్యలకు సంబంధించి 25 దరఖాస్తులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, వినతులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాలికల సంరక్షణ అందరి బాధ్యత: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బాలికల హక్కులు, భద్రత, విద్య, భవిష్యత్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సూచించారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాఖీ వేడుకల ద్వారా అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు బాలికల భద్రత, గౌరవాన్ని కాపాడాలనే సామాజిక బాధ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, సిబ్బంది "బాలికలను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం" అనే బేటీ బచావో-బేటీ పడావో సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## నర్సాపూర్ పట్టణ బీజేపీ కన్వీనర్‌గా గొల్ల ప్రేమ్ కుమార్ యాదవ్ నియామకం

మెదక్, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): నర్సాపూర్ పట్టణ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కన్వీనర్‌గా గొల్ల ప్రేమ్ కుమార్ యాదవ్‌ను నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీపై నమ్మకంతో, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రేమ్ కుమార్ యాదవ్ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నర్సాపూర్ పట్టణంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రేమ్ కుమార్ యాదవ్ తెలిపారు.



## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఏబీవీపీ

సిద్ధిపేట, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.11 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యేకు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారంలో మరింత జాప్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఏబీవీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.



## రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలు

పటాన్చెరు, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ బి. డేవిడ్): పటాన్చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో రజక సంఘం, రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, రజక యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రేగులపాటి జాతీయ బాలసాహిత్య పురస్కారానికి ఏడ్ల లక్ష్మి ఎంపిక

సిద్ధిపేట, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవయిత్రి ఏడ్ల లక్ష్మి 'రేగులపాటి లక్ష్మి జాతీయ బాలసాహిత్య పురస్కారం-2025'కు ఎంపికైనట్లు రంగినేని ట్రస్ట్ అధ్యక్షుడు నవీన్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం సిరిసిల్లలో రంగినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే పిల్లల పండుగ సందర్భంగా బాలసాహిత్య రంగంలో విశిష్ట సేవలందించిన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది బాలసాహిత్య పురస్కారానికి ఏడ్ల లక్ష్మిని ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలసాహిత్యంలో గేయాలు, కథలు రచించడంతో పాటు పలు పుస్తకాలను ప్రచురించిన ఏడ్ల లక్ష్మికి జాతీయ స్థాయి పురస్కారం దక్కడం పట్ల సిద్దిపేటకు చెందిన కవులు ఉండ్రాళ్ల రాజేశం, ఎరుకోల లక్ష్మయ్య, పెండోట వెంకటేశ్వర్లు, బస్వరాజ్ కుమార్, పర్గాములు, కాల్వ రాజయ్య, సుధాకర్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## గౌడ సంక్షేమ భవన్ నిర్మాణానికి మంత్రి తుమ్మల భూమిపూజ

ఖమ్మం, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్: రఘునాథపాలెం సబ్‌స్టేషన్ ఎదురుగా తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం గౌడ సంఘానికి కేటాయించిన 30 గుంటల స్థలంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గౌడ సంక్షేమ భవన్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్, హస్తకళల కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు గౌడ్, డీసీసీ ఖమ్మం నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, గోపా ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాసరావు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, ప్రధాన కార్యదర్శి మార్కం లింగయ్య గౌడ్, మోకు దెబ్బ నాయకులు బండి నాగేశ్వరరావు గౌడ్, బిచ్చల తిరుమలరావు గౌడ్, బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, ఊడుగు రమేష్ గౌడ్, రడం సురేష్ గౌడ్, సంపేట ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, సెప్టెంబర్ 01 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులు అందజేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ఫిర్యాదులను బాధ్యతగా పరిగణించి విచారణ పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యమని, సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## ఖర్గే సభ అనంతరం శుద్ధీకరణ కార్యక్రమంపై చర్యలు తీసుకోవాలి: మెదక్ ఎస్పీకి కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఫిర్యాదు

మెదక్, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీనియర్ దళిత నాయకుడు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభ అనంతరం నిర్వహించినట్లు పేర్కొంటున్న శుద్ధీకరణ కార్యక్రమంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు తాడేపు మహేందర్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కాంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, 2026 ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామలీలా మైదానంలో మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభలో పాల్గొన్నారని, అనంతరం ఆగస్టు 10న అదే ప్రదేశంలో శుద్ధీకరణ హవన్ యజ్ఞం నిర్వహించినట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థించిన ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్‌తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం, ఇతర వర్తించే చట్టాల కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. దళితుల గౌరవం, రాజ్యాంగ హక్కులు, సామాజిక సమానత్వ పరిరక్షణ కోసం ఈ ఫిర్యాదు చేస్తున్నట్లు తాడేపు మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మాసన నాగరాజు మాదిగ, పస్తం పాపయ్య, అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేడ్చల్ రామస్వామి, మనోహరాబాద్ మండల నాయకులు, మాసైపేట్ శ్రీనివాస్, కర్రే మహేష్, సర్గాల వినయ్, తూప్రాన్ సురేష్, కాలాలి రవి, చంచు శ్రీకాంత్, శివంపేట్ మండల నర్సన్న రోహిత్, బాల్కంపేట్ బాలాజీ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాలాత్రిపురసుందరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన





సంగారెడ్డి, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: నిజాంపేట్ సర్కిల్–191 పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో బాలాత్రిపురసుందరి సమేత విశ్వేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆలయ భూమిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలన్ చంద్రశేఖర్ రెడ్డి ఆలయ నిర్మాణ నిధికి తన వంతుగా రూ.1,00,000 విరాళాన్ని ప్రకటించారు. నూతన ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయి కాలనీవాసులకు, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని నాయకులు ఆకాంక్షించారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆరాధ్య నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న వై. పండరి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మా ఫంక్షన్ హాల్‌లో సోమవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జి బాపు మల్ శెట్టి పుత్రిక ఆరాధ్య నూతన వస్త్రాలంకరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారి ఆరాధ్యను ఆశీర్వదించారు. అనంతరం బాపు మంజుల–మల్ శెట్టి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు పాల్గొని చిన్నారి ఆరాధ్యను ఆశీర్వదిస్తూ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

## అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలి ఆలస్యంపై ఆరోపణలు

మెదక్/అల్లాదుర్గం, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: అల్లాదుర్గం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటలు దాటినా వైద్యురాలు ఆసుపత్రికి రాకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. వైద్యురాలు తరచూ సమయానికి విధులకు హాజరు కావడం లేదని, దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందాల్సిన సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి, వైద్యురాలి విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుని, ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



## యూరియా కోసం రైతుల ఆందోళన.. స్థానిక అవసరాలు తీర్చాకే ఇతర గ్రామాలకు తరలించాలని డిమాండ్

నిజాంపేట, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో యూరియా కొరతపై రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామానికి సుమారు 450 బస్తాల యూరియా వచ్చినప్పటికీ తమకు సరిపడా ఎరువులు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం యాప్‌లో బుకింగ్ చేసుకున్నప్పటికీ ఎరువులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో యూరియా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ముందుగా నస్కల్ గ్రామ రైతుల అవసరాలను పూర్తిగా తీర్చిన తర్వాతే మిగిలిన యూరియాను ఇతర గ్రామాలకు తరలించాలని సొసైటీ నిర్వాహకులను డిమాండ్ చేశారు. యాప్ విధానంతో సంబంధం లేకుండా స్థానిక రైతులకు ప్రాధాన్యత ఇచ్చి, సకాలంలో యూరియా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



## గుంతలమయంగా మారిన కాన్షీరాం నగర్ రహదారి

మెదక్/అల్లాదుర్గం, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల ప్రతినిధి ప్రవీణ్: అల్లాదుర్గం మండలం కాన్షీరాం నగర్ ప్రాంతంలోని రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు వాటిలో నిలిచిపోవడంతో వాహనదారుల రాకపోకలు కష్టతరంగా మారాయి. గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని కాన్షీరాం నగర్ వాసులు కోరుతున్నారు.

## ఆరు గ్యారంటీలు ఇచ్చి 1000 రోజులు దాటినా హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: లింగాల కమల్ రాజు



మధిర, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్: ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు దాటినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించి అధికారాన్ని అప్పగించారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులకు రూ.4,000 పెన్షన్, రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇందిరమ్మ ఇళ్ల హామీ వంటి అంశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాదని, ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన ప్రజా పాలన అని కమల్ రాజు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, మిషన్ భగీరథ వంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నిస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పలు పోరాట కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్ర పార్టీ నిర్ణయించిన కార్యాచరణను మధిర నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు వివరించి ప్రతి కార్యకర్తను ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం చేస్తామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, ప్రతి గ్రామంలో ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మధిర నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు, యువత, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే ప్రజలను కలుపుకొని ప్రజా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని, ప్రజా సమస్యలపై చురుకుగా పనిచేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కమల్ రాజు పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని ఆయన తెలిపారు.



## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి: సీపీఎం

అందోల్, సెప్టెంబర్ 1, సందేశం టైమ్స్ ప్రతినిధి: మండలంలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం ఆందోల్ డివిజన్ కన్వీనర్ డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు జోగిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలకు తక్షణమే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు, మంజూర్లు కల్పించాలని, ఖాళీ స్థలాలు ఉన్న అర్హులైన పేదలకు కూడా ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలం, పక్కా ఇల్లు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఇళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.